ప్రజాశక్తి

సోమవారం 6 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

మూడ్రోజులుగా మురుగులే..!

- గుంటూరులో మెరుగుపడని తాగునీటి సరఫరా
- 10 రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆరు రోజులు మరమ్మతులు - మూడ్రోజులుగా మురుగునీరు
- కమిషనర్‌కు తప్పుడు నివేదికలిస్తున్న ఎఇలు
- జోరుగా నీళ్ల వ్యాపారం - అవస్థ పడుతున్న జనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేసవి తీవ్ర రూపం దాల్చక ముందే గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నగర పాలక సంస్థ అధికార యంత్రాంగం వైఫల్యం కారణంగా మరమ్మతుల పేరుతో ఈనెల 22 నుంచి ప్రారంభమైనమ తాగునీటి సమస్య 10 రోజులుగా కొనసాగుతోంది. మరమ్మతుల పేరుతో నాలుగు రోజులు నీటి సరఫరాను నిలిపేయగా తరువాత మూడు రోజులు పాక్షికంగా సరఫరా చేశారు. పాత పైపు లైన్ల నుంచి కొత్త పైపు లైన్లకు నీటి సరఫరా మార్పు వల్ల మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో కుళాయిల్లో మురుగు నీరు సరఫరా అవుతోంది. పైపులైన్లలో నీటిని పంపింగ్ చేసే ప్రక్రియను చాలా తేలికగా తీసుకుని హడావుడిగా మార్చడం వల్ల ఈ పరిస్థితి తలెత్తగా పట్టించుకునే వారే కరువయ్యారు.

నీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిఇలు, ఎఇలు తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. నగరంలో సగ భాగం నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారినా ఎవరూ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం లేదు. ఎఇలను కమిషనర్ నిలదీస్తే అంతా బాగుందని చెప్పండి అని ఇఇలు, డిఇలు వారికి సూచిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా నియమితులైన ఎఇలు క్షేత్రస్థాయి పరిస్థితులపై కమిషనర్‌కు తప్పుడు సమాచారం ఇస్తున్నారని తెలిసింది.

స్తంభాలగరువులోని మున్సిపల్ ట్యాంకు వద్ద పైపులో నుండి నీరు పట్టుకుంటున్న మహిళ

నగరంలో 10 రోజులుగా నీటి సరఫరా సరిగా లేకపోవడంతో మినరల్ వాటర్ ముసుగులో నడిచే క్యాన్ల నీటి వ్యాపారం జోరందుకుంది. కుళాయిల్లో మురుగు నీటి సరఫరా వల్ల ఈ వ్యాపారం మరింత పెరిగింది. గుంటూరులో 2013లో రూ.460 కోట్ల వ్యయంతో రక్షితనీటి పథకం నిర్మాణ పనులు ఐదేళ్ల క్రితం పూర్తి చేశారు. అయినా ఇంకా నీటి సరఫరా మెరుగుపడలేదు. నగరంలో నిత్యం ఏదో ప్రాంతంలో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. మూడు నెలలకు ఒకసారి మరమ్మతుల పేరుతో అధికారికంగా నీటి సరఫరా నిలిపివేస్తుంటారు. రూ.లక్షల్లో

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

భయపెడితే విద్యలో నాణ్యత వస్తుందా?

- సంస్కరణల నుండి పక్కదారి పట్టించేందుకే నిర్బంధం
- యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమాశాల్లో రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగంలో చేపడుతున్న ప్రపంచ బ్యాంకు సంస్కరణలపై ప్రశ్నించకుండా పక్కదారి పట్టించేందుకు ఉపాధ్యాయులపై యాప్‌లు భారం, నిర్బంధాలతో భయభ్రాంతులకు ప్రభుత్వం గురి చేస్తోందని, ఇదంతా ఒక పథకం ప్రకారం సాగుతోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉపాధ్యాయుల్ని భయపెడితే నాణ్యమైన విద్య వస్తుందా? అని ప్రశ్నించారు. స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో యుటిఎఫ్ జిల్లా 48వ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధారణ బదిలీలు నిర్వహించలేకపోతుందని, పిఆర్‌సి బకాయిలు రూ.వేలకోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, 1వ తేదీన జీతాలు విడుదల చేయలేని ప్రభుత్వం ఉపాధ్యాయులపై నిర్బంధం ప్రయోగిస్తోందని విమర్శించారు. విద్యాశాఖ అదికారులు పాఠశాలలను సందర్శించటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆ పేరుతో భయభ్రాతులకు గురి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రాథమిక తరగతుల్ని హైస్కూల్స్‌లో విలీనం చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రాథమిక విద్య కనుమరుగు అవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 12వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులను కుదించి, బోధనేతర

▶ 2లో

లోపలి పేజీల్లో

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

- చదువుల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- చదువుకునే వాతావరణాన్ని ఏర్పరిచేలా తల్లిదండ్రులతో చర్చ
- 'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి
- ప్రజాశక్తితో విద్యాశాఖ ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు

రాజధానికి భూములిచ్చాం.. మా సంగతేంటి..?

సురేష్ కుమార్‌ను నిలదీసిన మహిళా రైతులు

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ఐద్వా ఆధ్వర్యంలో నిరసనలు

సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

భయపెడితే విద్యలో నాణ్యత వస్తుందా ?

(మొదటి పేజీ తరువాయి)

పనుల భారం మోపితే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని నిలదీశారు. ప్రతి ఏటా వేసవిలోనే బదిలీలు, ప్రమోషన్ల నిర్వహించే విధంగా కేరళ, కర్నాటకలో మాదిరిగా కోడ్ తేవాలని డిమాండ్ చేశారు. భూకేంద్ర సిద్ధాంతానికి బదులు సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, కఠిన కారాగార శిక్షను ఎదుర్కొన్న శాస్త్రవేత్త బ్రూనో నేడు ఉపాధ్యాయులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ధైర్యంగా ఉండి నిర్బంధాలను ఎదుర్కొనాలని, ప్రభుత్వం చేపడుతున్న విద్యారంగా వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక తరగతుల వల్ల ప్రాథమిక విద్య కనుమరుగు అవుతుందని, 70 వేల టీచర్ పోస్టులు రద్దవుతాయని అన్నారు. సెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులే ఉండబోవన్నారు. 30 వేల ప్రమోషన్లు ఇస్తామని 5 వేలు ఇచ్చారని, అవి కూడా ప్రమోషన్లో, డిప్యుటేషన్లో కూడా ఉపాధ్యాయులు చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని వివరించారు. పిఆర్సి బకాయిలు ఏడాదిన్నర నుండి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఉద్యోగుల హక్కులన్నీ హరించి, 1వ తేదీన జీతాలు ఇవ్వండని అడుక్కునే స్థితికి ప్రభుత్వం నెట్టిందని మండిపడ్డారు. ఐక్య పోరాటాల ద్వారా ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. మున్సిపల్ హెచ్ఎంలకు డిడిఒ పవర్స్ సాధించటం యుటిఎఫ్ కృషి ఫలితమేనని చెప్పారు.

కార్యక్రమంలో తొలుత సీనియర్ నాయకులు కెఎస్వి దుర్గారావు జాతీయ జెండాను, జి.ప్రభుదాసు ఎస్టిఎఫ్ఐ జెండాను, ఎన్.తాండవకృష్ణ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి సౌహార్ద సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటంలో యుటిఎఫ్ అగ్రభాగాన ఉందని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులు కలిసి ప్రభుత్వ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వినోద, జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎమ్డి.దౌలా, జిల్లా కార్యదర్శులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

ముస్లింల ఆర్థిక అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. స్థానిక షాదీఖానా పక్కన అంజుమన్ ఏ ఇస్లామియా అసోసియేషన్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నూతన నిర్మాణాల శంకు స్థాపన కార్యక్రమంలో ఆది వారం ఆయన పాల్గొన్నారు. అంజుమన్ కమిటీ పేద ముస్లింలకు ఆర్థిక సహాయం చేకూర్చడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మూడ్రోజులుగా మురుగులే..!

(మొదటి పేజీ తరువాయి)

వెచ్చిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండటం లేదు.

పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీపురం, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఎ.టి.అగ్రహారం, మార్కెట్ యార్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, కోర్టు కాంపౌండ్,కెవిపి కాలనీ, వికాస్ నగర్, శ్యామలనగర్, హనుమయ్య నగర్, నెహ్రూనగర్, రాజీవ్‌గాంధీ నగర్, బొంగరాల బీడు, వసంతరాయపురం, శారదాకాలనీ రిజర్వాయర్ల పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోరంట్ల, నగరాలు ప్రాంతాల్లో వారం రోజులపాటు త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విలీన గ్రామాల ప్రజల కష్టాలను పట్టించుకునే నాథుడు లేరు. మరో వైపు గుంటూరులో అపార్ట్‌మెంట్ల వాసులు నీటికి కటకటలాడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సంపుల్లోకి నీటిని నింపుకొని తమ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు.

బోర్లు ఎండిపోయినీటి లభ్యత తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నారు. తాగటానికి నీటి క్యాన్లను కొనుగోలు చేసుకుంటున్న అపార్టుమెంట్ వాసులు వాడకానికి మాత్రం కార్పొరేషన్ ట్యాంకర్ల నీటిపై ఆధారపడుతున్నారు. జిఎంసి పరిధిలో ఉన్న 42 మంచి నీటి రిజర్వాయర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు నీటికి అవస్థ పడుతున్నారు. అపార్ట్‌మెంట్ వాసులు రోజు మార్చి రోజు ప్రయివేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుని సంప్‌లో పోయించుకుంటున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసిపి

ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -మంగళగిరి

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, వైసిపికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని టిడిపి నాయకులు రంగశెట్టి నరేంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం పట్నంలోని రెండవ వార్డులో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పలువురు మాట్లాడుతూ జగన్ పరిపాలనలో ప్రజలపై అనేక భారాలు మోపారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, గోశాల రాఘవ, సింహాద్రి రామారావు, టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లంబర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బీమాపై ప్లంబర్లకు అవగాహన

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణంలోని విజయ ట్రేడర్స్ ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రోడ్డులోని కళ్యాణమండపంలో ఆదివారం ఆస్ట్రల్ పైప్స్ కంపెనీల ప్లంబర్స్‌కు ఇన్సూరెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ డాక్టర్ కె. కిరణ్ కుమార్ ఇన్సూరెన్స్ చేసుకోవడం వలన జరిగే ఉపయోగాలను వివరించారు. ప్రతినిత్యం పనిలో ఉండే వారికి అనుకోని విధంగా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వలన ఉపయోగ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఏఎస్ఎం ప్రసాద్, విజయ ట్రేడర్స్ యజమాని బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళ్యాణి డెంటల్ క్లినిక్ డైరెక్టర్, డాక్టర్ రాజా వైద్య పరీక్షలు చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు కార్యాలయంలో పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలకు సోమవారం ఉచిత వైద్య శిబిరము నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులకు బీపి, షుగర్, హార్ట్,క్యాన్సర్ లాంటి వ్యాధులకు టెస్ట్ లు ఉచితంగా చేస్తామన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

సభలో మాట్లాడుతున్న డాక్టర్ మయూరి

శుక్లాలు, నీటికాసులు, కంటికలక, రెటీనల్ డిజార్డర్స్, ఐలిడ్ సమస్యలపై 40 ఏళ్లు పైబడిన వారు అప్రమత్తంగా ఉండాలని శంకర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మయూరి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో సంగం డైరీ మాజీ ఛైర్మన్ కిలారి రాజన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ మయూరి మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత వివిధ కంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయని, చత్వారం సమస్య, కళ్లద్దాలు వాడటంతో పరిష్కారం అవుతుందన్నారు. చూపునకు అడ్డంపడి చికాకు కలిగించే ఫ్లోటర్స్ సమస్య ఉన్నప్పుడు మాత్రం డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. వృద్ధాప్యంలో కళ్లు పొడిబారినప్పుడు కంటిని తడిగా ఉంచటానికి ప్రత్యేకమైన ఐడ్రాప్స్ వాడాలన్నారు. కంటిలో నీళ్లు ఎక్కువగా కారే వాళ్లు కూలింగ్ గ్లాసులు వాడాలన్నారు. ఇన్‌ఫెక్షన్ వల్ల కొన్ని కెమికల్స్ సోకటం వల్ల ఎలర్జీల వల్ల వచ్చే కంటికలక వ్యాధిపై డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కంటికి సంబంధించి ప్రధాన సమస్య అయిన గ్లోకోమా వ్యాధి కంటిలో ఫ్లూయిడ్ ఎక్కువ అవటం వల్ల వస్తుందని, దీనిని మొదటి దశలో నివారించలేకపోతే చూపుదెబ్బతింటుందని తెలిపారు. రక్తపోటు, మధుమేహ వ్యాధుల వంటివి కంటిని, కంటి నరాలను దెబ్బతీస్తాయన్నారు. ఈ సందర్భంగా అవగాహన సభ్యులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ఎన్.తిరుపతయ్య, హాస్పిటల్ ఆర్ఒ కాళ్ల ప్రసాద్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు జి.వెంకటరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మహిళలను సత్కరించడం అభినందనీయం

ప్రముఖ సైకాలజిస్ట్ దుర్వాసుల శార్వాణి

ప్రజాశక్తి-తెనాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక మూల్పూరు సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో ఆదివారం వివిధ రంగాల్లోని మహిళలను సత్కరించారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు పి.పురుషోత్తమశర్మ అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ దుర్వాసుల శార్వాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. అలాంటి మహిళామణులను గుర్తించి పరిషత్ ఆధ్వర్యంలో సత్కరించటం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహళల ఆర్థిక స్వావలంభనకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని మహిళలు అవధానుల హిమగిరిబాల, త్రిపురారిభట్ల సత్య జ్ఞానప్రసూనాంబ, కుప్పం ప్రసూన, వెల్లాల లిలితమ్మ, కస్తూరి ఇందిరాదేవి, తీర్థల స్వర్ణలత, ద్వాదశి సుమతి, వలివేటి ఉమ, భాగవతుల లలితాశారద, ధూళిపాళ్ళ రాజ్యలక్ష్మి, నీలంరాజు సరోజలను సత్కరించారు. కార్యక్రమంలో నిట్టల శైలజ, డి.శ్రీదేవి, ఎం.కౌసల్య పాల్గొన్నారు.

మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పరిషత్ బృందం

మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -తెనాలి

మహిళల్లో ఎదురయ్యే క్యాన్సర్ సంబంధిత వ్యాధులను ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదని డాక్టర్ డి.శారద అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ కుమార్ పంప్స్ ఆవరణలో కుమార్ పంప్స్, పట్టణానికి చెందిన శారద సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను ముందుగా గుర్తించే అవకాశం ఉందన్నారు. దీనిపై మహిళల్లో అవగాహన పెంపొందించి క్యాన్సర్ బారి నుంచి కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు, కుమార్ పంప్స్ వంటి సామాజిక సేవా దృక్పదం కలిగిన సంస్థలతో కలిసి ఉచిత వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా శారద సేవా సమితి చేస్తున్న కృషిని కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో కొత్త కృష్ణకుమార్, కొత్త హరి కుమార్, శేషుకుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, శారదా సేవా సమితి బృందం పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

‘ఆ చట్టంపై పోలీసులకు అవగాహన లేదు’

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక గ్రాండ్ వెంకటేష్ కళ్యాణ మంటపంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) ఆధ్వర్యంలో ఆదివారం ఎపి స్టేట్ రెం డవ జోన్ అసోసియేషన్ ప్రతినిధుల శిక్షణ, వర్క్‌షాప్ నిర్వహించారు. ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఫణికృష్ణ, రవీందర్ పాల్గొని మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఎపి మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమల్లోకి తీసుకొచ్చారని, ఇప్పటికీ ఆ చట్టంపై పోలీసులకు అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. రాజస్థాన్‌లో ప్రసవ సమయంలో మహిళ చనిపోతే అక్కడ వైద్యురాలిపై 302 సెక్షన్ కింద కేసు నమో దు చేయ డంతో ఆ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. వైద్యులు రోగుల ప్రాణాలు కాపాడతారే తప్ప వారికి హాని కలిగించారన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకుని ఆసుపత్రులు, వైద్యులపై దాడులు జరగకుండా పోలీసులు రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి అనేక రకాల వ్యాధులను తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీకి సంబంధించి ఇచ్చే ప్యాకేజీల రేట్లను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 20 పడకల ఆసుపత్రులకు కూడా ఆరోగ్యశ్రీ వర్తించేలా అనుమతిస్తే చిన్నపట్టణాల్లో కూడా ప్రజలకు ఉచిత వైద్యం అందు బాటులోకి వస్తుం దన్నారు. ఐఎంఎ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తున్నా మన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మూడు విభాగాల్లో ఐఎంఎ పనిచేస్తోందన్నారు. మహిళా విభాగంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినిలు రక్తహీనతకు గురికాకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండేలా చూడటం, కేన్సర్ రాకుండా చూటడం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కలిగించడం చేస్తున్నట్లు వివరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భూషణ్ కుమార్, డాక్టర్ జెసి నాయుడు, డాక్టర్ రవీంద్రనాథ్, ఐఎంఎ చిలకలూరిపేట అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ కందిమళ్ల వాసుదేవ, అంకమ్మచౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

చిలకలూరిపేటలో ఐఎంఎ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపు

మంత్రి విడదల రజనికి ప్రసన్నాంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని బోటిమీద ప్రసన్నాంజనేయ స్వామి తిరుణాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రసన్నాంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఘనంగా సన్మానించారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఈపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, సంగం డెయిరి ఆధ్వర్యంలో తాగునీటిని పంపిణీ చేశారు. ఈపూరు గ్రామస్తులు ఐదు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ విప్పర్ల వెంకటరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.చెంచయ్య, జెడ్పిటిసి టి .చౌడయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆర్.చంద్రశేఖర్, వి.ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, కె.మహేష్ బాబు, దేవతి స్వరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నరసరావుపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్ టి యు) నిరంతరం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్‌వి రామిరెడ్డి అన్నారు. పల్నాడు రోడ్డులోని మున్సిపల్ బాలుర పాఠశాలలో ఆదివారం ఎస్‌టియు పల్నాడు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్టియు జిల్లా అధ్యక్షులు డి.పెద బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామిరెడ్డి మాట్లా డారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.గంగాధర బాబు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్ పాల్గొన్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

తాలూకా పోలీసులు రూరల్ పరిధిలో మందుబాబులు, పేకాటరాయుళ్ళకు ఆవాసాలుగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని ఖాళీ ప్లాట్లలో, ముళ్ల పొదల్లో పేకాడుతున్న ఆరుగుర్ని గుర్తించగా వారిలో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.1800 స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్స్, ద్విచక్ర వాహనాలు మూడింటిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన ముగ్గురి కోసం గాలించి వారిని కూడా అదుపులోకి తీసుకుని వారిపైనా కేసు నమోదు చేస్తామని, పట్టుబడ్డ వారిని కోర్టులో సోమవారం హాజరుపరుస్తామని ఎస్‌ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

సాగరమాత ఉత్సవాలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించే సాగరమాత ఉత్సవాలకు సుమారు 100 మంది పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు మాచర్ల రూరల్ సిఐ సమీముల్లా తెలిపారు. విజయపురిసౌత్ ఎస్ ఐ పి. అనిల్ కుమార్‌రెడ్డి తో కలిసి సాగరమాత ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. సిఐ మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాలను గుడివద్దకు అనుమతించేది లేదన్నారు. భక్తులు కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసే సమయంలో పుష్కరఘాట్ ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈత గాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆలయానికి వెళ్లే ప్రధాన కూడళ్లలో పోలీస్ సిబ్బందితో బద్రత ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉత్సవాలకు విచ్చేసే వారి వాహనాల పార్కింగ్ కోసం జింఖానా గ్రౌండ్ సమీపంలో స్థలాన్ని , ఆర్‌టిసి బస్సుల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆలయ విచారణ గురువులు పామిశెట్టి బాలసాగర్‌ను వారు కలిశారు. ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన వెంట ఎఎస్‌ఐ మస్తాన్ వలి, సిబ్బంది ఉన్నారు.

గోళ్లపాడులో వైవి ఆంజనేయులు ప్రచారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

వైసిపి ప్రభుత్వ దుర్మార్గాలను, దుశ్చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి శిక్షించాలని ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు అన్నారు. మండలంలోని గోళ్ళపాడులో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైసిపి నాయకుల అవినీతి అక్రమాలను, టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగారు. ఆంజనేయులు మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంలో, అభివృద్ధి మచ్చుకైనా కనిపించని రాష్ట్రంలో పేద,మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ముందుగా స్థానిక బాబు జగ్జీవన్‌రావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కటకం అమర వెంకటకృష్ణ,రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, క్లస్టర్ బాధ్యులు రావిపాటి దేవేంద్రరావు, మాజీ ఎంపిపి పచ్చల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యల్లమందయ్య,గుర్రం నరేంద్ర,గోనుగుంట్ల కృష్ణ,సయ్యద్ అన్వర్,టైలర్ సైదా,గనికపూడి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో వైవి ఆంజనేయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

చిన్నారికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

పాత కక్షల నేపథ్యంలో ఇనిమెల్లలో ఆదివారం జరిగిన ఘర్షణలో పాపకు తీవ్ర గాయా లయ్యాయి.గ్రామానికి చెందిన కటూరి హనుమంతరావు,కాసా కోటయ్య మద్యం మత్తులో కర్రలతో ఘర్షణ పడుతుండగా అదే సమయంలో మండాది వీరాంజనేయులు సమీప బంధువుల పాప మీనా లక్ష్మీపూర్ణను బజారుకు తీసుకొని వెళుతూ ఘర్షణ పడే వారిని వారించే క్రమంలో కర్ర లక్ష్మీపూర్ణ తలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. పాపని ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి 108 వాహనం ద్వారా మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై ఎటువంటి సమాచారం అందలేదని ఈపూరు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -మేడికొండూరు

లారీలు అక్రమంగా తరలిస్తున్న ప్రజాబంధు మేడికొండూరు పోలీసులు ఆదివారం పేరేచర్లలో పట్టుకున్నారు. గుంటూరులో నల్లచెరువు ప్రజల ప్రాంతాలలో ప్రజా పంపిణీ బి యాన్ని సేకరించి 85 బస్తాల బియ్యం నరసరావుపేటకు లారీలో తరలిస్తున్నారు. మేడికొండూరు పోలీసులకు అందిన సమాచారం మేరకు వలపన్ని బియ్యం పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తులు గుంటూరు నల్లచెరువు కు చెందిన దావల రాజేష్, ఫిరంగపురం మండలం 113 తాళ్లూరుకు చెందిన చింతా గోపి రామ్ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. 6ఏ కేసు నమోదు చేశారు.

విద్యార్థికి జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా రూ.10 వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు.స్థానిక ఎన్.టి.ఆర్.కాలనీలో నివసిస్తున్న డి.కుమార్ ధనలక్ష్మి కంపెనీలో కార్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతని కుమారుడు డి.సాయికిరణ్ తిరుమల ఇం జనీర్ కళాశాలలో బి.టెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సాంకేతిక సమస్య వలన అతనికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రాలేదు. కాలేజీ ఫీజ్ చెల్లించే నిమిత్తం సాయికిరణ్‌కు పదివేల రూపాయలను అతని ఇంటి వద్ద అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంవి ర త్నారెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, నకరి కంటి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కాస్మోటిక్స్ ఛార్జీలకు చెల్లుచీటి!

- సంక్షేమ హాస్టళ్లకు ఐదేళ్ల నాటి మెనూ ధరలే
- నేటికీ విద్యార్థులకు అందని కాస్మోటిక్ ఛార్జీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సంక్షేమ హాస్టళ్లలో చదు వుతున్న విద్యార్థినీవిద్యార్థులకు రావాల్సిన ఛార్జీలను ప్రభుత్వం గండి కొడుతోంది. నిరుపేదల, పేదల ప్రభుత్వమని చెప్పు కుంటున్న ప్రస్తుత ప్రభుత్వం 2018 సంవత్సరం నాటి మెనూ ధరలనే నేటికీ అమలు పర చడం అన్యాయమనే విమ ర్శలు వినిపిసు న్నాయి. ప్రస్తుతం మార్కె ట్‌లో నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం హాస్టళ్లకు సరుకులు సరఫరా చేయలేని పరిస్థితిలో ఉన్నామని కాంట్రాక్టర్లు తలలు పట్టు కుంటున్నారు.

ప్రస్తుతం పట్టణంలో ఎస్‌సి గురు కుల హాస్టళ్లు రెండు, బిసి హాస్టల్ బాయ్స్ , గర్ల్స్ కలిపి రెండు, ఒక ఎస్‌సి హాస్టల్ కలిపి మొత్తం ఐదు ఉన్నాయి. వాటిలో సుమారు 7 వందల నుంచి 8 వందల మంది విద్యా ర్థినీ విద్యార్థుల వరకు ఉన్నారు. ఏ విద్యా ర్థికీ ఇంత వరకూ కాస్మోటిక్స్ చార్జీలు చెల్లిం చ లేదని చెబుతున్నారు. దీంతో, ఆయా వస్తు వులను వారు తమ ఇంటి వద్ద నుంచే తెచ్చు కుంటున్నారు. ప్రతి నెలా వారికి అం దాల్సి కాస్మోటిక్ ఛార్జీలు అందక పోతుం డటంతో వారి తల్లిదండ్రులపై భారం పడుతోంది. సబ్బులు, పేస్టు, కొబ్బరి నూనె, బ్రష్, పౌడర్ల నిమిత్తం కాస్మో టిక్ ఛార్జీల కింద నెలకు ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.150 విద్యార్థినికి రూ.175 చొప్పున ప్రభుత్వం చెల్లించాలి. వీటిని కూడా మూడేళ్లుగా పెండింగ్‌లో పెట్టిం దని విద్యార్థుల తల్లిదండ్రులు వాపో తున్నారు. గత ప్రభుత్వం కాస్మోటిక్స్ ఛార్జీ లను నేరుగా వార్డెన్ ఖాతాల్లో వేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వేస్తోంది. అయితే, ఆ డబ్బులు పడ్డాయో లేదో కూడా తెలియడం లేదని వారి తల్లులు చెబుతున్నారు. కొంత మం దికి అయితే ఇందుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు కూడా లేవని చెబు తున్నారు. ప్రభుత్వం హాస్టళ్లలో ఉండి చదువుకునే 3 నుంచి 4వ తరగతి విద్యా ర్థులకు గతంలో నెలకు రూ.700, ప్రస్తు తం రూ. 1000, 5-7వ తరగతి విద్యా ర్థులకు గతంలో రూ.750, ప్రస్తుతం రూ. 1250 , 8-10వ తరగతి విద్యా ర్థులకు గతంలో రూ.850, ప్రస్తుతం రూ.1250. ఇంటర్ ఆపైన విద్యార్థులకు గతంలో రూ. 1200, ప్రస్తుతం రూ. 1400ను మెనూ ఛార్జీల నిమిత్తం కాంట్రాక్టర్‌కు ఇస్తున్నారని వార్డెన్లు అంటున్నారు.మార్కెట్లో ధరలను ఒక సారి పరిశీలి స్తే ఈ ధరలకు భోజనం అందించలేమని చెబుతున్నారు.ఉదయం అల్పాహారం వేరుశెనగ చట్నీతో, సాయం త్రం బెల్లంతో రాగి జావ, చిక్కిలు, రాత్రికి భోజనం, వారంలో రెండు రోజులు చికెన్, నాలుగు రోజులు ఉడి కించిన (ప్రస్తుతం కోడిగుడ్డు ధర రూ. 5.50, గతంలో రూ. 2.76) కోడి గుడ్డు, పాలు విద్యార్థులకు అందించాలని చెబు తున్నారే కానీ, పెరిగిన ధరలకు అను కూలంగా ధరలు పెంచడం విస్మరించారని కాంట్రాక్టర్లు విమర్శిస్తు న్నారు చికెన్, కోడిగుడ్డు మెనూ ప్రకారం ఇవ్వ లేమని, వారానికి ఒక రోజు చికెన్‌తో, 3 కోడిగుడ్లతో సరిపెట్టేస్తున్నామని వార్డెన్ల చెబుతున్నారు. ఈ మెనూ విద్యార్థులకు సరిపోదని ఇప్పటికైనా సంబంధిత అది కారులు, నాయకులు ఆలోచించాలని చెబుతున్నారు.

భోజనం బాగుండలేదు

పెదనందిపాడు మండలంలోని కన పర్రుకు చెందిన మూగ వర్తి పెద్దబ్బాయి మాట్లాడుతూ తమ అబ్బాయి చిలకలూరి పేటలోని ఎస్సి బాయ్స్ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్నట్లు చెప్పారు. విద్యా సంవత్సరం చివరికి వచ్చినా కాస్మో టిక్ ఛార్జీలు ఇవ్వలేదని అన్నారు. చదువు ఫర్వాలేదు కానీ భోజ నాలు బాగో లేదని చెబుతున్నాడని అన్నారు. ఇక్కడ పిల్లలు నాలుగు రోజుల కోసారి కడుపులో నొప్పితో బాధపడుతున్నా రని అబ్బాయి చెప్పినట్లు తెలిపారు. స్టడీ అవర్స్ ఇంకా మెరుగు పరచాలని సూచిం చారు. ఇప్పట్కైనా మంచి బియ్యంతో వారికి అన్నం పెట్టాలని, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు.

అలా అనడం అన్యాయం

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి ఐదేళ్లు అవుతోందని ఎస్ ఎఫ్ఐ చిలకలూరి పేట పట్టణాధ్యక్షులు ఉప్పుతేళ్ళ సిద్ధు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ, గురు కుల హాస్టళ్లలో చదువు తున్న విద్యార్థులకు 3-4 తరగతులకు రూ.1150, 5-10 తరగతులకు రూ.14 00 రూ ఇంటర్ ఆపై చదువులకు విద్యార్థులకు రూ.1600 పెంచినట్టు ప్రక టించిన ప్రభుత్వం, కాస్మోటిక్ చార్జీల పెంపు మరిచిందన్నారు. ఇప్పుడే అమలు చేయడం లేదని వచ్చే విద్యా సంవత్సరం లో అమలు చేస్తా మనడం అన్యాయ మన్నారు. నిత్యావస రాల ధరలు విప రీతంగా పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మెస్‌ఛార్జీలను నామ మాత్రంగా పెంచడం చూస్తుంటే ప్రభు త్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవు తోందని విమర్శించారు. నూతన మెనూకు పెంచిన ఛార్జీలు ఏ మాత్రం సరిపోవ న్నారు. ఇప్పుడున్న పరి స్థితుల్లో సంక్షేమ హాస్టళ్లలో పౌష్టికాహారం అందాలంటే నెలకు రూ. 2,500 పెం చాలని డిమాండ్ చేశారు.

మెస్ ఛార్జీలను రెట్టింపు చేయాలి

కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న మెనూ రేట్లు దారుణంగా ఉన్నా యని విమర్శించారు. విద్యార్థులకు రాగి జావలో బెల్లం కలిపి ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం మంచిదే కానీ, మెనూ ధరలు పెంచకుండా ఏవిధంగా ఇస్తారని ప్రశ్నిం చారు. కేవలం మాటలతోనే మోసం చేసు న్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా మెనూ ధరలు రెట్టింపు చేయాలని కోరారు.

127 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో సంతగుడిపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెలా మొదటివారం ఆ గ్రామంలో నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరంలో భాగంగా ఆదివారం పిడుగురాళ్ళకు చెందిన విజయ నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ వైద్యశిబిరాన్ని నరసరావుపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది మోదుగుల ఆరోగ్యం చౌదరి ప్రారంభిం చారు. వైద్యులు కె.వి.సుబ్బారావు, ఎం.ఫణికుమార్, ఎం.వి. ఎన్.సునీల్ కుమార్ వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబి రంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెం దిన 127 మందికి గుండె, ఊపిరితిత్తులు, నరాల బలహీనత, డెంగ్యూ, మలేరియా మొదలైన వ్యాధులకు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి షుగర్, బి. పి, ఇసిజి పరీక్షలు చేసి, ఆయా వ్యాధులు రాకుండా తీసు కోవా ల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో సంతగుడి పాడు మెడి కల్ క్యాంప్ నిర్వహణ కమిటీ సభ్యులు, విజయ నర్సింగ్ హోమ్ స్టాఫ్, కోసూరు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునుగోడు హైస్కూల్లో గ్రహంబెల్ జయంతి

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండలం మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం అలెగ్జాండర్ గ్రహం బెల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.గ్రహం బెల్ పగలంతా బోధిస్తూ,రాత్రంతా మేలుకుని ప్రయోగాలు చేసి ఆయన కృషి కారణంగానే తీగల ద్వారా శబ్ద తరంగాలను పంపగలిగే టెలి ఫోన్‌ను కనిపెట్టి సాంకేతికరంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాడని వక్తలు కొనియాడారు. అంతకు ముందు పాఠశాలలోని గ్రహం బెల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్.ఎం డాక్టర్ ఎ.శ్రీని వాసరెడ్డి,పీ.సి చైర్మన్ ఎస్.కె.సలావుద్దీన్,భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు టి.చంద్రయ్య, కనకదుర్గ,విద్యార్థులు పాల్గొన్నారు.

7,8 తేదీల్లో విశ్వవిద్యాలయ పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈనెల 7,8వ తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మం డలంలోని ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో అం తర్ కళాశాలల పురుషుల సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సి పాల్ డా. చుండు వెంకట్రావు ఆదివారం తెలిపారు. ఈ పోటీ లలో ప్రథమ స్థానం పొందిన విజేతకు మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు మెమోరియల్ రోలింగ్ ట్రోఫీని ఎంఎంఎం మెమోరియల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు అందజేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

అద్దె చెల్లించలేదని ఆర్‌బికెకు తాళం

ప్రజాశక్తి-పెదకూరపాడు

అద్దె చెల్లించలేదని లగడపాడు ఆర్ బికె కు ఆదివారం తాళం వేశారు. నెలల తరబడి అద్దె చెల్లించడం లేదని ఇంటి యజమాని మైనేని వెంక టేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.4,400 చొప్పున అద్దె కిచ్చారు. వెంకటేశ్వరరావు వ్యవ సాయశాఖతో ఒప్పందం చేసు కున్నారు. మండలంలో ఇప్పటికే పెద కూరపాడు ఒకటి రైతు భరోసా కేంద్రాన్ని మూసివేశారు. ఈ కేంద్రం పెదకూరపాడు లోని మూడవ రైతు భరోసా కేంద్రంలో నడుస్తుంది. మం డలంలో చాలా చోట్ల వ్యవసాయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఇంటి యజమానులు అద్దె విషయంలో ఒత్తిడి తీవ్రంగా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు రావాల్సిన బకాయిలు తర్వాత ఇచ్చిన ఫర్వాలేదు కానీ అద్దె వెంటనే ఇస్తే బాగుంటుందని తెలిపారు.

దీనిపై మండల వ్యవసాయ శాఖ అధికారి శాంతి మాట్లాడుతూ 14 నెలల బకాయి చెల్లించాల్సిన మాట వాస్త వమే అన్నారు. ఆదివారం కార్యా లయానికి సెలవు అన్నారు. దశల వారీగా అద్దె చెల్లిస్తున్నామన్నారు. అన్నిటికీ బిల్లులు పెట్టడం జరిగిం దన్నారు. త్వరలో రావడానికి అవ కాశం ఉందన్నారు.

ఆదమరిస్తే ఆయువు గల్లంతే...

జిబిసి కెనాల్ బ్రిడ్జి అనుకొని ఆర్ అండ్ బి రోడ్డుపై భారీ గుంత

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల పరిధిలోని నార్నెపాడు రోడ్డు వద్ద గల గుంటూరు బ్రాంచి కెనాల్ బ్రిడ్జికు అనుకుని భారీ గుంత ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. వాహనదారులు ఈ గుంతను గమనించకపోతే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే పరిస్థితి. సత్తెనపల్లి-నర్సరావుపేట ప్రధాన రహదారి వెంటే ఉండడం, జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండడం వలన నిత్యం భారీ వాహనాలతో సహా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు ఈ మార్గంలో సాగి స్తుం టాయి. ఎన్నో నెలలుగా నీటి కోతకు గురై ఆర్ అండ్ బి రోడ్డుపై ప్రమాద భరితంగా ఉన్న గుంతను పట్టించుకునేనాథుడే లేడు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్నప్పటికీ ఆర్‌అండ్‌బి అధి కారులు గానీ, ఎన్‌ఎస్‌పి అధికారులు గానీ పట్టించుకోకపోవడం గమ నార్హం. ప్రమాదభరితంగా ఉన్న గుంత వద్ద కనీసం ఎలాంటి హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి భారీ గుంతను పూడ్చాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తెనాలిలో కరపత్రాలను పంచుతున్న ములకా శివసాంబిరెడ్డి

పెరిగిన ధరలతో ప్రజలకు కష్టాలే..!

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలకు కష్టాలు తెస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం పెదనందిపాడులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెదనందిపాడు మండల పార్టీ సభ్యులు అభిమానుల జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి సిపిఎం.నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి.ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, ప్రజలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. ఇటీవలే వంటగ్యాస్ ధర సిలిండర్‌కు రూ.50లు పెంచి ప్రజలపై భారం వేశారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ పేదలపై భారాలు మోపే విధంగా ఉందని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, సంక్షేమ రంగానికి, వ్యవసాయానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోప్రక్క కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రకటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు చానల్ పొడిగింపు పనులకు వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించి ఇళ్ళ నిర్మాణం ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలు ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్ధతు ధరకు కొనుగోలు చేయాలని చెప్పారు.ఎండిఎంలకు బకాయి పడ్డ 3 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సిపిఎం.జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విధానాలనే అమలు జరుపుతుందని , రైతుల వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడం , ఆస్తి పన్ను, చెత్త పన్ను విధించడం దీనిలో భాగమేనని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపిచ్చారు. సమావేశంలో సిపిఎం.మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, మద్దూరి రమణ , సలీం, ఫణిదం భువనేశ్వరి, షేక్ షమి, జ్యోతి కుమారి, మర్రి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి: అన్ని రకాల పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల 5న ఢిల్లీలో జరిగే మహాసంఘర్షణ కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ గ్రామం జగ్గడిగుంటపాలెంలో ఆదివారం రైతులతో మాట్లాడారు. ర్యాలీని నిర్వహించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన మూడు నల్లచట్టాలు, విద్యుత్ చట్టంపై 13 నెలలు రైతులు అవిశ్రాంతంగా పోరాడారిన, ఫలితంగా ఆ చట్టాలను కేంద్రం రద్దు చేసినట్టు ప్రకటించినప్పటికీ దొడ్డిదారిన అమలు చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు మహా సంఘర్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎం.సాంబశివరావు, కె.వెంకటరమణ, టి.వెంకటేశ్వర్లు, డి.మల్లిఖార్జునరావు, టి.రవీంద్ర, ఎం.బసవశంకరరావు, డి.నాగేశ్వరరావు, గోపాలరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు: ప్రధాని మోడీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రియల్ 5వ తేదీన తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ కోరారు. సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ సమావేశం తుళ్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో కమిటీ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కార్మికులకు నష్టం చేకూర్చే కార్మిక చట్టాల సవరణకు రంగం సిద్ధం చేస్తోందని,ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కార్పొరేట్ మయం చేసిందని మండిపడ్డారు.ఉద్యోగ కల్పన మరచి ఉన్న ఉద్యోగాలను పీకేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. భాగ్యరాజు మాట్లాడుతూ రాజధాని ప్రాంత కార్మికులకు కార్మిక చట్టాలను వర్తింప జేయడం లేదన్నారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగ్ లో ఉంచుతున్నారని, కనీస వేతనం,పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా ఇవ్వడం లేదని అన్నారు.అదేమని అడిగిన కార్మికులను పనిలో నుంచి తొలగిస్తామని కాంట్రాక్ట్ సంస్థలు బెదిరింపులకు దిగుతున్నాయని అన్నారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత కోసం పోరాడే సిఐటియు సంఘంలో కార్మికులు చేరాలని విజ్ఞప్తి చేశారు.మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో అక్రమంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులను తిరిగి పనిలోకి తీసుకోవాలని,వారికి పని భద్రత కల్పించాలని,సెక్యూరిటీ గార్డుల న్యాయమైన డిమాండ్‌లకు సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ సమావేశంలో తీర్మానించారు.

తాడేపల్లిలో కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

కార్మిక హక్కులను కాలరాస్తోన్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-తాడేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తాడేపల్లి టిటి యార్డులో ముఠా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని మండిపడ్డారు. కార్మికవర్గం ఐక్యంగా ఏకతాటిపై ముందుకు వచ్చి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, బాబూరావు, మేస్త్రి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

ప్రధానమంత్రి మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరుతూ ఇంటింటా ప్రచారం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ ఆఫీసు ప్రాంతం, సలాం హోటల్ సెంటర్, క్వారీ రోడ్డు, రన్నింగ్ రూమ్ సెంటర్, పోతురాజుస్వామి గుడి, ముగ్గురోడ్డు, ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్, లంబాడీపేట తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, కె.బాబూరావు, అచ్చయ్య, టి.శ్రీను పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న విజయేంద్ర ప్రసాద్, తదితరులు , నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ముగిసిన విజ్ఞాన్ నిరులోత్సవ్

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థులు జీవితంలో ఏం సాధించాలన్నా ధైర్యం, ఆత్మస్థైర్యం ఉండాలని, రాజ్యసభ సభ్యులు, ఇండియన్ స్క్రీన్ రైటర్ అండ్ ఫిల్మ్ డైరక్టర్ కే.వీ.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం, పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి టెక్నికల్, కల్చరల్, ఫైన్‌ఆర్ట్స్, లిటరరీ, స్పోర్ట్స్‌ఫెస్ట్ ' నిరులోత్సవ్-2కే23' వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు, సమస్యలు, సవాళ్లు ప్రతి ఒక్కరికీ ఉంటాయని, వాటిని చూసి కుంగిపోకుండా ఎలా పరిష్కరించుకోవాలో మనసుపెట్టి ఆలోచిస్తే పరిష్కారాలు దొరుకుతాయన్నారు. పేదరికం, ఆకలిని కఠినంగా అనుభవించిన వాళ్లే జీవితంలో పైకి ఎదగడానికి అవకాశాలను సృష్టించుకుంటారన్నారు. విద్యార్థులు రాబోయే 10 ఏళ్లలో ఏమి అవ్వాలనుకుంటున్నారో ముందే నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్ణయించుకుని, ఆ లక్ష్య సాధనకు ప్రతిరోజూ కఠోర శ్రమతో ముందుకెళ్లాని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. వినూత్న ఆలోచనలకు కాస్తంత క్రియేటివిటీ, టెక్నాలజీను జోడించి ఉపయోగించుకుంటే జీవితంలో విద్యార్థులు ముందుకు దూసుకెళ్లి పోవచ్చని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. అనంతరం విజ్ఞాన్ నిరులోత్సవ్‌లో 39 ఈవెంట్లలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపల్ పాతూరి రాధిక, కన్వీనర్ డాక్టర్ వీ.సుజాత, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రథోత్సవం

ప్రజాశక్తి -మంగళగిరి

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు దివ్య రథోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి ఆదివారం తెలిపారు. అదే విధంగా సోమవారం రాత్రి 12 గంటలకు కళ్యాణం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు రోజులు పాటు పోలీస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

అదాని కుంభకోణంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తున్న ఆదానీ కుంభకోణంపై ప్రధానమంత్రి మోడీ పెదవి విప్పాలని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి మేకా అమరారెడ్డిభవన్‌లో కంచర్ల సాంబశివరావు అధ్యక్షతన సిపిఎం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీతో ఆదానీ బృంధం ఎలా పెనవేసుకుందో ఇటీవల జరిగిన కుంభకోణం వల్ల తెలుస్తుందని చెప్పారు. దేశ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వే, టెలికాం, ఎల్ఐసి లాంటి ప్రభుత్వ సంస్థలను మోడీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దేశాన్ని అమ్మేస్తున్న మోడీ పాలన పట్ల రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మాట్లాడకపోవటం దురదృష్టకరమని అన్నారు. స్థానికంగా గుంటూరు ఛానల్ పూడుకుపోయిన తూటుకాడను తొలగించాలని అధికారులను కోరారు. పొలాలకు వెళ్లే డొంకరోడ్లకు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. మురుగుతో కూడిన ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌ను బాగు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలలను తగ్గించాలి : ఐద్వా

ప్రజాశక్తి - నరసరావుపేట

గ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తూ పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం వద్ద ఐద్వా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా మహిళా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజినీ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయో గించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్ కు రూ.50, వాణిజ్య సిలిండర్ కు రూ .350, చొప్పున పెంచడం దుర్మార్గమన్నారు. ఒకవైపున ఇచ్చే అవసరాల ధరలు పెరిగి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితిలు ఎదుర్కొంటుంటే మరోవైపు గ్యాస్ ధరలు 2 నెలల వ్యవధిలో రెండుసార్లు పెంచడం దారుణమన్నారు. ఉపాధి లేక వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలను నియంత్రంచాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చి దేశాన్ని దోచిపెడుతోందని విమర్శించారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి సబ్సిడీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమ శ్రీ మాట్లాడుతూ సామాన్య మధ్యతరగతి ప్రజలపై బారాలు మోపే మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. గ్యాస్ భారాన్ని తక్షణమే తగ్గించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఉపసంహ రించుకోవాలని నినాదాలు చేశారు. మహిళా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు రంజాన్ బి, సిఐటియు నరసరావుపేట పట్టణ కమిటీ ట్రెజరర్ షేక్ మస్తాన్ వలి, సభ్యులు డి.చంద్రబోస్, మహిళా సంఘం కార్యకర్తలు, స్థానిక మహిళలు ఫాతిమున్, రాధిక, శాంతి పాల్గొన్నారు.

నరసరావుపేటలో..

వినుకొండలో..

ప్రజాశక్తి - వినుకొండ

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోని విక లాంగుల కాలనీలో గ్యాస్ బండలు బయట పెట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐద్వా నాయకురాలు నాసర్బి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికీ పదిసార్లు గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచి సామాన్య ప్రజలపై భారం మోపాడని విమర్శించారు. ఇష్టానుసారంగా ధరలు పెంచి సామాన్యులపై అధిక భారం మోపి దోచుకుంటున్నారన్నారు. సామాన్యుల జీవనం ప్రశ్నార్థకంగా మారిందని, మహిళలందరూ ఐక్యంగా పోరాడి ప్రజలను దోచుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో వికలాంగుల కాలనీ మహిళలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాలను పేద మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పాత తపాలా శాఖ కార్యాలయం వద్ద గల రాధా సుందర కళ్యాణ మండపంలో ఆదివారండాక్టర్ పోపూరి రాధాకష్ణమూర్తి శత జయంతిని సందర్భంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో, శంకర కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో , డాక్టర్ రాధా సుందర మెమోరియల్ మెడికల్ ట్రస్ట్ మరియు నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు .ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న రాధా సుందర ట్రస్ట్ వారికి, రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నరసరావుపేట రోటరీ క్లబ్ కుల మత, ప్రాంత రాజకీయలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. సుమారు 400 మంది హాజరై పరీక్షలు చేయించుకోగా, అందులో కేటరాక్ట్ పరీక్షలకు 110 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో రోటరీ ఫాస్ట్ గవర్నర్ కేపీ రంగారావు, జిల్లా అందత్వ నివారణ సంస్థ అధికారిని ఎ.భువనేశ్వరి, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి. శోభారాణి, డాక్టర్ నల్లూరి రమేష్, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ రొటేరియన్ మిట్టపల్లి రమేష్, రాధా సుందర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పోపురి గోపాలకష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావుకు నివాళి

ప్రజాశక్తి-వినుకొండ

ఎపిఎస్ఆర్టిసిలో నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు పి.రామ్మోహనరావు 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా రామ్మోహనరావు విగ్రహానికి ఎన్ఎంయు సీనియర్ నాయకులు, విగ్రహ దాత డి.హనుమాన్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీలో ఎన్నో సంసకరణలు తీసుకొచ్చిన ఘనత రామ్మో హనరావుదేనని, నేటి వరకు కూడా ఆర్టీసీ ప్రైవేటీకరణ జరగకుండా ఉందంటే అది ఆయన కృషి ఫలితమేనని కొనియాడారు. కార్యక్రమంలో డిపో కమిటీ చైర్మన్ వి. శివ నాయక్, పివి రాఘవ, హరిహర బాబు, కఠారి , సురేష్ నాయక్, ముసలమ్మ, ఎం కె నాయక్ , సౌభాగ్యరాజు, సైదా, జానీ భాష, యోహాను తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి రైల్వేస్టేషన్ ను తనిఖీ చేస్తున్న డిఆర్ఎం రామకృష్ణ

సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం. రామకృష్ణ ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. అమత భారత కార్య క్రమానికి ఎంపికైన స్టేషన్ల ను డిఆర్ఎం తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రైల్వే అధికారులకు పలు సూచనలు చేశారు.రైల్వే స్టేషన్ బయట లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రయణికులకు అవ సరమైన సౌకర్యాలను గుర్తించారు.రైల్వే క్వార్టర్స్ లో డ్రైనేజీ సమస్య వుందని ప్రహరీ గోడ లేకపోవడంతో విష సర్పాలు వస్తున్నాయని, రైల్వే ట్రాక్ కు క్వార్టర్స్ కు మధ్య ప్రహరీ నిర్మించాలని కోరుతూ డిఆర్ఎంకు రైల్వే సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని డిఆర్ఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ అమృత భారత కింద స్టేషన్ ను అబివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్, ఎస్కలేటర్ సౌకర్యం ఏర్పాటు చేస్తా మని తెలి పారు. డిఆర్ఎం వెంట ఎడిఆర్ఎం శ్రీనివాస నాయక్, సీనియర్ డిఇఎన్ సుదర్శన్ సీనియర్ డిఒఎం భాస్కర్ రెడ్డి, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలను పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెంచాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. ఫణిదం ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సర్టిఫికెట్ మంజూరు కోసం సంబంధిత బృందాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పర్యటించ నున్న నేపథ్యంలో ఈ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఔట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, సిబ్బంది వివరాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయో వివరాలు సేకరించారు.ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. మిషన్ శోభకృత్ కార్యక్రమం కింద అవసరమైన చర్యలు తీసుకొని శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించాలని సూచించారు. ఈఆరోగ్య కేంద్రం నిర్వహణ,మౌలిక వసతులు బాగున్నాయని ప్రశంసించారు. అనంతరం ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య తగ్గుదలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సంబంధిత డాక్టర్ వివరణిస్తూ 24 గంటలు పని చేసేందుకు ఆయాల కొరత ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ కవిత, సెంటర్ హెల్త్ ఆఫీసర్ సీతారామమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ మీనాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరుధాన్యాల దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవాన్ని నరసరావుపేటలోని హిందూ స్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాలైన చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేశారు. వీటిని దాదాపు 50 స్టాల్స్‌లో ప్రదర్శనకు, అమ్మకానికి ఉంచారు. ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, భార్య భాగ్యలక్ష్మి, కలెక్టర్ భార్య లక్ష్మి, హాజరయ్యారు. విద్యార్థినీ విద్యార్థులు తయారుచేసిన చిరుధాన్యాల వంటకాలను రుచి చూసి వారిని అభినందించారు. ఈ ఏడాదిని ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడమే ఈ ప్రదర్శనకు కారణమని హిందూ స్కూల్ డైరెక్టర్ పివి రావు తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కౌన్సిలర్ పురుషోత్తం, హెల్త్ సూత్ర సిఇఒ శివ సాయికృష్ణ భరద్వాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ మానస, స్కూల్ డైరెక్టర్ శివప్రియ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర, దళిత-గిరిజన, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య (సిఐటియు) నియో జకవర్గ సమావేశం స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో ఆదివారం నిర్వ హించారు. రాష్ట్ర కార్యదర్శి కాకాని అప్పారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో ఆరోగ్య మిత్రులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, సమాన పనికి సమాన వేతనం రూ.26,000 ఇవ్వాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు .16 సంవత్సరాల నుండి ఈ పదకంలో పని చేస్తున కనీస వేతనం అమలు చేయలేదని, ఉద్యోగ భద్రత లేదని, సంక్షేమ పథకాలు అమలు జరగలేదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు ఉద్యోగ భద్రత ,సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని, ఆరోగ్య మిత్రలకు ప్రభుత్వ ఉద్యోగాలు వెయిటింగ్ సౌకర్యం కల్పించాలని మొదలైన డిమాండ్స్ చేశారు. ఆరోగ్య మిత్రలు బి. శ్రీనివాసరావు, రవిచంద్ర, ,మహేశ్వరి, హనుమంతరావు, కె.అప్పారావు, హరి బాబు నాయక్ పాల్గొన్నారు.

రాజధానికి భూములిచ్చాం.. మా సంగతేంటి..?

కత్తెర సురేష్ కుమార్‌ను నిలదీసిన మహిళా రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి భూములిచ్చాం.. మా సంగతి ఏమిటి.. మాకు న్యాయం చేస్తారా.. లేదా.... అమరావతి రాజధానికి కట్టుబడి ఉన్నామని చెబుతూ కోర్టులకు ఎందుకు వెళ్లారు..? అని వైసిపి తాడికొండ నియోజవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ను మహిళా రైతులు నిలదీశారు. రాజధాని ప్రాంతం అనంతవరంలో ఆదివారం సురేష్ కుమార్ చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా రాజధాని అంశంపై మహిళా రైతులు ప్రశ్నలు గుప్పించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ రాజధానిపై నిర్ణయాధికారం ముఖ్యమంత్రి చేతిలో ఉంటుందని అన్నారు. అలాంటప్పుడు మీరేందుకు వచ్చారు..? అని మహిళలు అడగడంతో వైసిపి నాయకులు కలుగజేసుకున్నారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం తలెత్తింది. సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకునేందుకు వచ్చామని వైసిపి నాయకులు సమాధానమిచ్చారు. ఉద్యోగాలు లేవని, రోడ్లు బాగా లేవని, ఎస్సీ కాలనీల్లో తాగునీటి కుళాయి ఒక్కటే ఉందని గ్రామస్తులు సురేష్ కుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.మహేంద్ర, బి.శివారెడ్డి, బి.శ్రీకాంత్, కె.శేషగిరిరావు, బి.స్టాలిన్, ఎస్.సందీప్ పాల్గొన్నారు.

సురేస్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న మహిళా రైతులు

తాగునీటి కుళాయికి మరమ్మతు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆదివారం ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో వచ్చిన మీ పంపు మీరే బాగు చేసుకోండి అంటూ వచ్చిన వార్తా కథనంపై ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. తీసిన గుంతను పూడ్చి పంపుకు మరమ్మతు చేశారు. దీంతో స్థానిక ప్రజలకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది. పంపు మరమ్మతు సందర్భంగా తామే గుంత తీసుకుంటామని స్థానికులే ముందుకు వచ్చారని ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

పిఎం భారతీయ జన ఔషధి పరియోజన వారోత్సవాల సందర్భంగా స్థానిక లక్ష్మీడీలక్స్ కూడలిలోని యడ్ల గంగాధర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. జనరిక్ మందుల షాపు నిర్వాహకులు దివ్వెల ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన శిభిరంలో డాక్టర్ డి.శారద, డాక్టర్ వినీల్, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ వినయ్, అంజలి క్రిష్టీనా బృందం రోగులకు ఉచిత వైద్యసేవలందించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మంగమ్మ మాట్లాడుతూ జనరిక్ మందుల షాపుల్లో ప్రజలకు అవసరమైన మందులు తక్కువ ధరలకు లభ్య మౌతాయన్నారు. టి.శివశంకరరావు, భార్గవ్, జ్యోతి, పద్మావతి, రమాదేవి,అఖిల్, సన్నీ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోండి

జిల్లా అదనపు ఎస్‌పి అనిల్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని జిల్లా అదనపు ఎస్‌పి అనిల్‌కుమార్ అన్నారు. పెదకాకాని మండలం రైన్ ట్రీ పార్క్ లోని జెమ్స్ పబ్లిక్ స్కూల్ 10 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పంచ సూత్రాలతోనే విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్తారు అన్నారు. నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, క్రమశిక్షణ, నాలెడ్జ్, రెస్పాన్సిబిలిటీ, ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు తోడ్పాటును అందించాలని అన్నారు. విద్యార్థులందరికీ మోటివేషన్‌తో పాటు సెల్ఫ్ డిసిప్లేన్ ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మానవ వనరులే దేశానికి పెద్ద బలమని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి వార్షికోత్సవ నివేదికను వివరించారు. నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యా విధానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అత్యుత్తమ విద్య బోధనలను అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ వి.ఝాన్సీ లక్ష్మి, వి. సాంబశివరావులు తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఐజి కార్యాలయంలో పరిపాలన అధికారి బి. రాజ కుమారి, ఎస్ ఆర్ యం.యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. నారాయణరావు,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫైసర్ బి. కరుణ, జేమ్స్ పబ్లిక్ స్కూల్లో మేనేజర్ మనోహర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డొక్కామాణిక్యవరప్రసాద్

ఘనంగా డొక్కా పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు కృష్ణనగర్‌లోని వైసిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు పుష్పగుచ్చాలు ఇచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షాలు తెలిపారు. కేక్ కట్ చేసి తనకు శుభాక్షాంక్షలు తెలిపిన వారికి వర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, మద్దాలిగిరి,కిలారి రోశయ్య, మిర్చియార్డుచైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, వైసిపి నాయకులు తాడిశెట్టి మురళీ, నూరి ఫాతిమా, తాడికొండ, పత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షాలు తెలిపారు.

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పొన్నూరు ముస్లిం మైనారిటీ నాయకులు గుంటూరులోని డొక్కా మాణిక్య వరప్రసాద్ కార్యాలయంలో ఆయనను కలసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ నాజర్, షేక్ వాహెదుల్ల,మొల్లా కరీం, నాగూర్ భాష, డక్కు మాల రవి పాల్గొన్నారు

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-గుంటూరు: ఆర్ఎస్ఎస్, బిజెపి కార్పొరేట్ కాషాయ మనువాద సిద్ధాంతాలను అరికట్టడానికి, ప్రజలందరూ ఏకమై జాతీయస్థాయిలో విశాలమైన ఐక్యవేదికను ఏర్పాటు చేయాలని డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్ పేర్కొన్నారు. కొత్తపేటలోని మల్లయలింగం భవన్‌లో నిర్వహించిన సదస్సులో గోపీనాథ్ మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు భారత్‌బచావో సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచి దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపి చేస్తున్న ఫాసిజాన్ని గుర్తురిగి ప్రజాస్వామ్యవాదులు సామాజిక న్యాయం కోరే ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు.భారత బచావో ఉమ్మడి గుంటూరు జిల్లా సదస్సు స్థానిక మల్లయ్య లింగం భవనం గుంటూరు నందు ఆదివారం నాడు సదస్సు కన్వీనర్ కోలా నవజ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు విన్సెంట్‌పాల్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, నరసింహారావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ప్రత్యూష సుబ్బారావు, ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ జియావుర్ రెహమాన్, సామాజిక తత్వవేత్త డాక్టర్ అంజయ్య, ద్రవిడ సమ్మేళనం చైర్మన్ ఆకురాతి మురళీకష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లవరెడ్డి లక్ష్మణరెడ్డి విరసం రాష్ట్ర నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు సదస్సులో ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోపీనాథ్

డాక్టర్ మంజుల, వక్తలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

సినీ రంగంలో ఎన్టీఆర్ సంస్కరణలపై సమీక్ష

ప్రజాశక్తి -తెనాలి : మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఎన్‌టిఆర్ నటించిన సినిమాలు, రాజకీయ జీవితం, సంస్కరణలపై ఆదివారం స్థానిక పెన్షనర్స్‌అసోసియేషన్ హాల్లో సమీక్ష జరిపారు. ముఖ్య అతిథులుగా పెమ్మసాని పోతురాజు, జెట్టి రేణుక పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ మ్యూజిక్ అండ్ ఆర్ట్స్ విభాగం రేడియో ఆర్టిస్ట్ డాక్టర్ చింతలపాట మంజులతో పాటు వక్తలను సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, ఎం. కోటేశ్వరరావు, డి, భవాని,ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, ఎస్. అనురాధ, ఆర్. లక్ష్మీప్రసన్న, డి.భాస్కర్, శేషు, మధు, సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైఆర్ శాస్త్రిని సత్యరిస్తున్న శ్రీ కళారంజని బృందం

ఘంటసాల సంగీత విభావరి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణానికి చెందన ప్రముఖ సాహితీ సాంస్కృతిక వేదిక శ్రీకళారంజని ఆధ్వర్యంలో స్థానిక కవిరాజాపార్కులోని విజికె భవన్‌లో ఆదివారం రాత్రి ఘంటసాల సంగీత విభావరి-2ను నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కెఎస్ఎల్ పద్మావతిదేవి అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘంటసాల స్మారక పురస్కార గ్రహీత, హైదరాబాద్‌కు చెందిన గాయకులు వైఆర్ శాస్త్రి బృందం ఘంటసాల పాటలను ఆలపించారు. ఆ పాత మధురాలతో ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా పద్మావతిదేవి మాట్లాడుతూ మధుర గాయకులు ఘంటసాల ఆలపించిన ఎంతో శ్రావ్యమైన పాటలను వైఆర్ శాస్త్రి గొంతుకలో వినటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఆర్ శాస్త్రిని సంస్థ తరపున సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ కళారంజని బృందం వాకా పేరిరెడ్డి, జి.మురళీకృష్ణ, వి.కరుణ, సాయిప్రణీత్, వంశీకృష్ణ, మనీష పాల్గొన్నారు.

రచయిత్రి పద్మావతికి రచయితల సంఘం అభినందన

పజాశక్తి-గుంటూరు

తాటికొల పద్మావతి

గుంటూరు నగరానికి చెందిన కవయిత్రి, కథ, నవలా రచయిత్రి తాటికొల పద్మావతి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాహితీ రంగంలో చేసిన విశేష కృషికి మార్చి 8న పరశరామ బ్రాహ్మణ సేవా సంఘంచే సత్కారం అందుకోనున్న సందర్భంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ఎస్.ఎం.సుభానీ ఒకప్రకటనలో అభినందనలు తెలిపారు. వివిధ రంగాలలో సత్కారం అందుకుంటున్న మహిళలు ఎం.రాజేశ్వరి, పద్మవల్లి, సి.హెచ్. శిరీష, వి.జయ, ఎం.లక్ష్మిమాధవి, కె. రంగనాయకి, ఆర్.అమూల్యదేవి, కె.నివేదితకు అభినందనలు తెలియజేశారు.

ర్యాలీలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, వైద్యాధికారి శోభారాణి తదితరులు

ఆర్థికాభివృద్ధిలో మహిళలు కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు పోటీపడి రాణిస్తున్నారని, ఆర్థికాభివృద్ధిలోనూ వారు కీలకమని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాయం వద్ద ర్యాలీ చేపట్టగా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. స్త్రీ లేనిదే సమాజం లేదని, స్త్రీలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపొద్దని, వారు కూడా ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్ సాధించుకోవడానికి ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ఆడపిల్లలు సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. బాలికలు సైతం తాము ఎందులోనూ తక్కువ కాదనే మానసిక ధృఢత్వాన్ని సాధించాలని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పట్టుదలను కలిగి ఉండాలని, ఏదైనా సాధించగలమనే ధృఢ నిశ్చయంతో ఉంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి, డాక్టర్ పద్మావతి, రత్నాకర్, ఒన్నురుబాషా, ఖాజావలి, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, మున్సిపల్ హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్నింటా రాణిస్తున్నా తప్పని వివక్ష

ఐద్వా సభలో శమంతకమణి

ప్రజాశక్తి-తాడేపల్లి

సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నా వివక్ష మాత్రం తప్పడం లేదని ప్రముఖ రచయిత్రి, నాటక దర్శకులు జి.శమంతకమణి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తూరులో ఆదివారం రాత్రి బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. డాక్టర్ దగ్గర నుంచి విమానాలు నడిపే దాకా మహిళలు ఉన్నా చులకన భావనతో చూడటం పాలకుల పాపమేనని అన్నారు. పని గంటల తగ్గింపు పోరాటంలో మహిళలు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. నేడున్న సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టెక్నాలజీ పెరిగి అరచేతిలోకి వచ్చిన నేపథ్యంలో మరోపక్క అదే టెక్నాలజీ వల్ల యువత పాడైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నవయసులోనే మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, అశ్లీల వీడియోల వల్ల యువత పాడైపోతోందని ఆవేదన వెలిబుచ్చారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నా అమలులో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. సమాజంలో రుగ్మతలపై కలిసికట్టుగా పోరాడాలని కోరారు. తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ప్రజలపై ప్రభుత్వాలు భారాలు మోపుతున్నాయని, ఇటీవల గ్యాస్ ధర పెంపు అందులో భాగమేనని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సరిపడ తరగతి గదులు లేకుండా, ఉపాధ్యాయులు లేకుండా అందరికీ విద్య ఎలా అందుతుందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. మాతృభాషలో విద్యను తప్పనిసరి చేయాలని, దాంతో పాటు ఇంగ్లీష్ నేర్పాలని కోరారు. విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ప్రతి పాఠశాలలో ఆటస్థలం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సభకు ఐద్వా పట్టణ అధ్యక్షులు దొంతిరెడ్డి విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ఐద్వా పట్టణ కార్యదర్శి పి.గిరిజ, నాయకులు బి.వెంకటలక్ష్మి, దుర్గ, డి.దశరధరామిరెడ్డి, డి.విజయభాస్కరరెడ్డి, డి.యోహాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సభలో మాట్లాడుతున్న శమంతకమణి, హాజరైన మహిళలు, చిన్నారులు

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

- చదువుల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- చదువుకునే వాతావరణాన్ని ఏర్పరిచేలా తల్లిదండ్రులతో చర్చ
- 'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి
- ప్రజాశక్తితో విద్యాశాఖ ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు

పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధించేందుకు కృషి చేస్తున్నట్లు విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జెడి) వి.ఎస్.సుబ్బారావు తెలిపారు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలిపారు.

వి.ఎస్.సుబ్బారావు

'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యలు?

ప్రీ ఫైనల్‌లో వచ్చిన మార్కులు ఆధారంగా ఎ, బిబి, సి కాకుండా డి, ఇ కేటగిరిల్లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సంబంధిత విద్యార్థులకు వివిధ పద్ధతుల్లో చైతన్యపరుస్తాం. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు నేరుగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి ఇంటి పరిసరాలను పరిశీలిస్తారు. తల్లిదండ్రులతో మాట్లాడతారు. విద్యార్థికి చదువుకునేందుకు ఇంటిలో అనువైన పరిస్థితులు ఉన్నాయో లేదో పరిశీలిస్తారు. ప్రత్యేక వసతి ఉండేలా తల్లిదండ్రులను చైతన్య పరుస్తాం. పరీక్షలు పూర్తయ్యే వరకూ ఫోన్లు, స్మార్టు టివిలు వాడొద్దని కోరతాం. రాత్రి 8 గంటల వరకు చదివించేలా దృష్టి పెడతాం. ఉదయం 5 గంటల నుంచే విద్యార్థులను పర్యవేక్షిస్తాం పరిసరాల్లో పిల్లలకు ఇబ్బంది లేకుండా చూసేలా తల్లిదండ్రులతో చర్చిస్తాం. విద్యార్థులకు మంచి ఆహారం అందించేలా చూడాలని కోరతాం. విద్యార్థులు, తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తాం. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, మునిసిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై దీన్ని అమలు చేస్తాం.

పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తారు?

ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరుగుతాయి. ఈ ఏడాది ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే ఉన్నాయి. ప్రతి పేపరుకు ఒకటి రెండు రోజులు సెలవులు వచ్చాయి. అందువల్ల విద్యార్థులకు చాలా వెసులుబాటు ఉంది. పరీక్షల రోజుల్లో తల్లిదండ్రులు ఇతర అంశాలపై దృష్టి సారించకుండా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేలా దృష్టి పెట్టాలి. విద్యార్థులకు ఒక పేపరుకు, మరో పేపరు మధ్య సెలవులు వచ్చిన కాలాన్ని బాగా సద్వినియోగం చేసుకుని పరీక్షలకు సిద్ధం కావాలి. 100 మార్కులకు ఒకే పేపరు ఉంటుంది. అయితే ప్రశ్నల సంఖ్య పెరగకుండా ప్రశ్నలకు మార్కులు పెంచారు. ప్రతి సబ్జెక్టులో 32 ప్రశ్నలు ఉంటాయి. 24 పేజీల బుక్ లెట్ ఉంటుంది. అవసరమైతే అడిషనల్ షీట్స్ కూడా ఇస్తారు.

సిలబస్ పూర్తయిందా?

ఇప్పటికే సిలబస్ పూర్తయింది. 9వ తేదీ నుంచి ప్రీఫైనల్స్ ఉన్నాయి. పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. గతేడాది కరోనా ఇతర సమస్యల వల్ల ఫలితాలు చాలా తక్కువగా వచ్చాయి. ఈ ఏడాది కనీసం 85 నుంచి 90 శాతం ఉత్తీర్ణత ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ఉత్తీర్ణతను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు?

గతంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జిల్లాలకు స్థానాలు ఎంపిక చేసే వారు. ఈసారి కొత్త జిల్లాల ప్రాతిపదికన ఉత్తీర్ణత స్థానాలు ఉంటాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రశ్నాపత్రాలు కూడా ఆయా జిల్లాల కస్టోడియన్ పాయింట్లకు పంపుతాం.

ముఖ ఆధారిత హాజరలు అమలు ఎలా ఉంది?

నూటికి నూరు శాతం సక్రమంగా అమలు అవుతోంది. కొన్నిచోట్ల 99 శాతం వరకు అమలు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలున్న చోట మినహా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు వచ్చి ముఖ ఆధారిత హాజరును నమోదు చేస్తున్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో పివి సింధు తదితరులు

చదువు, ఆటలకు సమాన ప్రాధాన్యం

విటోపియా-2023 వార్షిక క్రీడ, సాంస్కృతిక ఉత్సవాల ముగింపులో పివి సింధు

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని ఐనవోలు సమీపంలోని విట్ యూనివర్సిటీలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న విటోపియా-2023 వార్షిక క్రీడ, సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తాను బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా బిజీ షెడ్యూల్‌లో ఉన్నా ఎంబిఎ పూర్తి చేశానని తెలిపారు. జీవితంలో రాణించడానికి మరింత కృషి చేయాలని సూచించారు. వర్సిటీ వీసీ డాక్టర్ కోటా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పర్చడానికి విటోపియా-2023 మంచి వేదికని, ఇతర 48 యూనివర్సిటీలు, కాలేజీల నుండీ విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారన్నారు. ప్రపంచ పారాలింపిక్ వాలీబాల్ ఇండియా జట్టును విటోపియా-2023లో ఎంపిక చేయడం తమ వర్సిటీకే గర్వకరణమన్నారు. సాంస్కృతిక పోటీల్లో విజేతలకు సినీ దర్శకులు బాబి కొల్లి, నటి పాయల్ రాజపుత్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్ బృందం గీతాలాపన మంత్రముగ్ధుల్ని చేసింది. చివర్లో ట్విన్ స్ట్రింగ్స్ ఇండియన్ బ్యాండ్ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి గౌరవ అతిథిగా పివి సింధు తండ్రి పివి రమణ హాజరవగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అనుపమ నంబూరు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు షటిల్ పోటీలు

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. నీటిపారుదల శాఖకు చెందిన నందిని, గ్రామ వార్డు సచివాయాల నుండి అరుణ గెలుపొందారు. కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా విభాగం చైర్మన్ ఎం.రాధారాణి, కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.సతీష్‌కుమార్, నేహాగున్నీ, ఎఎస్పీ సుప్రజ, సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విల్సన్‌బాబు పాల్గొన్నారు. ఈ పోటీల్లో